సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 22 । అక్టోబర్ । 2023



ప్రతిపక్షాల మాట నమ్మొద్దు
ఎన్నికల ముందు ప్రగల్భాలు పలికే వాకి మాటలు నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. 10లో▸



పేదలకు అండ
కాంగ్రెస్ జెండా ఎల్లవేలలా పేదలకు అండగా ఉంటుందని ఎమ్మెల్సీ, కల్వకుర్తి నియోజకవర్గ అభ్యర్థి కసిరెడ్డి అన్నారు. 10లో▸



సంప్రదాయాలకు ప్రతీక
శంకర్‌పల్లి మండలం కొండకల్ గ్రామంలో శనివారం బతుకమ్మ వేడుకలను ఉత్సాహంగా, ఉల్లాసంగా జరుపుకొన్నారు. 10లో▸

న్యూస్‌రీల్

బీఎల్‌ఓ, సూపర్ వైజర్లపై వేటు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఓటర్ల జాబితా రూపకల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన బూత్ లెవెల్ అధికారి, సూపర్‌వైజర్లపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి సస్పెన్షన్ వేటు వేశారు. శేరిలింగంపల్లి శాసనసభా నియోజకవర్గం 335 పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓటర్ల జాబితాలో తప్పిదాలు చోటుచేసుకున్నాయని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు అందింది. ఈసీ ఆదేశాల మేరకు కలెక్టర్ విచారణ జరిపించగా, ఓటర్ల జాబితాలో పొరపాట్లు జరిగినట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన బీఎల్‌ఓ సుజాత, సూపర్‌వైజర్ గణేశ్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సవాళ్లను అధిగమించాలి



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న రెడ్యానాయక్

మొయినాబాద్: విద్యార్థులు పోటీ ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఉస్మానియా యూనివర్సిటీ ఓఎస్‌డీ వైస్ చాన్సలర్ బి.రెడ్యానాయక్ అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న అరిస్టాటిల్ పీజీ కళాశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఎంబీఏ విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎంబీఏలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అందజేశారు. పట్టభద్రులకు పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అమృత్, ప్రిన్సిపాల్ ఎల్.శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతో బంగారు భవిత



మాట్లాడుతున్న సినీనటుడు సునీల్ తదితరులు

మొయినాబాద్ రూరల్: ఉన్నత విద్యతో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు లభిస్తుందని సినీనటుడు సునీల్ పేర్కొన్నారు. అజీజ్‌నగర్ సమీపంలోని కేఎల్ యూనివర్సిటీలో వార్షిక టెక్నో కల్చర్ ఫెస్ట్ 'అవిన్య–2023'ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నటుడు సునీల్ మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యంతో ముందుకు వెళ్తే సాధించలేనిది ఏదీ లేదన్నారు. మీ భవిష్యత్తుకు మీరే మార్గదర్శకులని పేర్కొన్నారు. జాతీయ పెంటాథన్ రాగ్డ్ సిస్టమ్స్ సంస్థ సీఈవో డాక్టర్ మణికందన్‌అయ్యర్ మాట్లాడుతూ.. విద్యార్థులు నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ పార్థసారథి వర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ, ఈవెంట్ కన్వీనర్ కె.శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వార్షిక ధ్రువీకరణ పత్రం సమర్పించాలి

సాక్షి, సిటీబ్యూరో: జంటనగరాల పరిధిలోని ప్రభుత్వ పింఛనుదారులు నవంబర్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు వార్షిక ధ్రువీకరణ పత్రం సమర్పించాలని నగర పింఛను చెల్లింపు కార్యాలయం సంయుక్త సంచాలకులు వసుంధర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ధ్రువీకరణ పత్రంపై పాస్‌పోర్టు సైజ్ ఫొటో అంటించి బ్యాంక్ అధికారి లేదా గెజిటెడ్ అధికారిచే సంతకం చేయించి పింఛను చెల్లింపు కార్యాలయంలో నేరుగా కానీ, టీ–యాప్ లేదా మీ సేవ లేదా జీవన్ పవన్ ఆన్‌లైన్ ద్వారా కానీ సమర్పించవచ్చన్నారు.

ఘనంగా రథోత్సవం

అనంతగిరి: దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం వేంకటేశ్వర స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయం నుంచి పట్టణ ప్రధాన వీధుల మీదుగా భక్తుల కోలాటం, చెక్క భజనల నడుమ శోభాయాత్ర సాగింది. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మహిళలు, పట్టణ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సింహవాహనంపై పద్మనాభుడు

దసరా నవరాత్రులను పురస్కరించుకుని వికారాబాద్ పట్టణ ఆలంపల్లిలోని అనంతపద్మనాభస్వామి ఆలయ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం రాత్రి స్వామి వారు సింహ వాహనంపై ఆలయ మాడ వీధుల్లో ఊరేగారు.

విరులు.. పెరిగెను ధరలు

పూల ధరలకు రెక్కలు

- బతుకమ్మ, దసరా వేడుకల నేపథ్యంలో డిమాండ్
- కిటకిటలాడుతున్న మార్కెట్లు
- అమాంతం రేట్లు పెంచిన వ్యాపారులు
- బంతి కిలో రూ.80 నుంచి రూ.100
- చామంతి, గులాబీ రూ.400పైమాటే..
- భగ్గుమంటున్న గుమ్మడికాయ ధరలు



మార్కెట్లో పూలను కొనుగోలు చేస్తున్న జనం

సాక్షి, రంగారెడ్డిజిల్లా/షాద్‌నగర్: సద్దుల బతుకమ్మ, విజయదశమి నేపథ్యంలో పూలు, గుమ్మడికాయ ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. కొనుగోలుదారుల బలహీనతను ఆసరాగా చేసుకుని వ్యాపారులు ధరలను అమాంతం పెంచేశారు. ధరలపైనే కాకుండా వ్యాపారులపై కూడా నియంత్రణ లేకపోవడంతో కొనుగోలుదారులు నష్టపోవాల్సి వస్తోంది. విధిలేని పరిస్థితుల్లో వ్యాపారులు చెప్పినంత చెల్లించి కావాల్సినవి కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఒకప్పుడు ఐదు నుంచి పది కిలోలు కొనుగోలు చేసిన వారు పెరిగిన ధరల కారణంగా కిలో, రెండు కిలోలతోనే సరిపెట్టుకుంటున్నారు. నగరంలోని గుడిమల్కాపూర్ పూల మార్కెట్‌లో సాధారణ రోజుల్లో బంతి కేజీ ధర రూ.40 నుంచి రూ.60 పలికితే.. శనివారం ఏకంగా రూ.150 పలికింది. ఇక చామంతి సాధారణ రోజుల్లో కిలో రూ.80లోపే ఉండగా, తాజాగా రూ.250పైగా ఎగబాకింది. రిటైల్ షాపుల్లో ఇవే పూలకు రూ.400పైగా డిమాండ్ ఏర్పడింది. గులాబీ పూల ధరలదీ ఇదే పరిస్థితి. కిలో రూ.250 వరకు పలుకుతోంది. కనకాంబరాలు కిలో రూ.1,200, మల్లెపూలు కిలో రూ.500, గునుగు, తంగేడు పూలు కిలో రూ.200 పలుకుతున్నాయి. గుమ్మడి, కట్ల, చేమంతి, బంతి, రుద్రాక్ష, గోరింట, కలువ, నందివర్ధనం, గడ్డి పూలు, గన్నేరు, కమల పూలు కిలో రూ.100 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు. వాహన, వ్యాపార, వాణిజ్య సముదాయాలు, ఆయుధ పూజకు ఎక్కువగా ఉపయోగించే మంచి గుమ్మడి కాయ (మీడియం సైజు) సాధారణ రోజుల్లో రూ.వంద లోపే లభించేది. తాజాగా వీటి ధర రూ.150 నుంచి రూ.200కు పెరిగింది. బూడిద గుమ్మడి కాయ సాధారణ రోజుల్లో సైజును బట్టి రూ.100 నుంచి రూ.150కే లభించేది. ప్రస్తుతం చిన్న సైజు కాయ ధర సైతం రూ.150 నుంచి రూ.300 వరకు విక్రయించడం విశేషం.

కిటకిటలాడిన మార్కెట్లు

ఆదివారం సద్దుల బతుకమ్మ, సోమవారం విజయదశమి ఉండటంతో పూలతో పాటు గుమ్మడి కాయలను కొనుగోలు చేసేందుకు జనం మార్కెట్లకు పోటెత్తారు. గడ్డిపూలు, గునుగు, తంగేడు, బంతి, చేమంతి, గులాబీ పూలు ఇలా రకరకాల పూలు మార్కెట్లకు పోటెత్తాయి. మార్కెట్లు, ప్రధాన కూడళ్లతో పాటు రహదారులకు అట ఇటుగా పూలు, గుమ్మడికాయ రాశులతో కళకళలాడాయి. వీటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో రావడంతో ఆయా ప్రాంతాలన్నీ రద్దీగా మారాయి. డిమాండ్‌కు, సరఫరాకు మధ్య భారీ వ్యత్యాసం ఉండటంతో పూలు, గుమ్మడి కాయల ధరలు ఆకాశాన్నంటాయి.

తగ్గిన దిగుబడి

ఈసారి వర్షాలు అనుకున్న స్థాయిలో కురవకపోవడంతో పూల దిగుబడి బాగా తగ్గింది. కొన్ని గ్రామాల్లో పూల తోటలు దెబ్బతిన్నాయి. పెద్ద ఎత్తున బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తుండటంతో పూలకు డిమాండ్ బాగా పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు.

డిమాండ్ పెరిగింది



బతుకమ్మలను తయారు చేయడంలో పూలనే ఎక్కువగా ఉపయోగిస్తారు. చాలామంది బంతి పూలతో పాటు ప్రకతి సిద్ధంగా లభించే పూలను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది కంటే ఈసారి పూలకు డిమాండ్ బాగా ఉంది.

– సద్దాం, పూల వ్యాపారి, షాద్‌నగర్

ఎన్నికల ప్రక్రియపై అవగాహన ఉండాలి

కలెక్టర్ భారతి హోళికేరి



సమావేశంలో మాట్లాడతున్న కలెక్టర్ భారతి హోళికేరి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు ఎన్నికల ప్రక్రియ, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై సంపూర్ణ అవగాహన కలిగిఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని సమావేశ మందిరంలో శనివారం మాస్టర్ శిక్షకులు, సెక్టార్ అధికారులకు పీవో, ఏపీవోల విధులపై చేపట్టిన శిక్షణ, అవగాహన కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పీవో, ఏపీవోలు పోలింగ్, పోలింగ్ యంత్రాల నిర్వహణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లపై ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించాలన్నారు. ఎన్నికల అధికారులు, బ్యాలెట్ యూనిట్, ఏజెంట్ల సీటింగ్ నమూనా మేరకు చేపట్టాలన్నారు. పోలింగ్ యంత్రాల సమస్యలు ఎదురైతే వెంటనే సెక్టార్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. మాక్ పోలింగ్, పోలింగ్ సందర్భంలో సాంకేతిక సమస్యలు ఎదురైనప్పుడు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన ఉండాలన్నారు.

ఆ ఘటనలకు ఆస్కారం ఇవ్వొద్దు

బూత్ ఆక్రమణ, అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన ఉండాలని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ కేంద్రంలోకి ఎవరిని అనుమతించాలి, క్యూ నిర్వహణ ఎలా చేయాలి, ఓటర్ల గుర్తింపు ఏ విధంగా చేపట్టాలి, ఓటింగ్ తర్వాత క్లోజ్ బటన్, ఓటింగ్ యంత్రాల సీలింగ్, ఎన్నికల పత్రాల సీలింగ్, చట్టబద్ధమైన ఫారాలు పూరింపులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎన్నికల సంఘంచే జారీ చేసిన పీవో హ్యాండ్ బుక్, పూర్తిగా చదివి, ఏ సమయంలో ఏం చేయాలి తూ.చ. తప్పకుండా పాటించాలని తెలిపారు. సెక్టార్ అధికారులకు మాస్టర్ ట్రైనర్లు స్వర్ణలత, ఆనంద్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పోలింగ్ అధికారుల విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు, మాస్టర్ శిక్షకులు, సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

సహాయ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

ఎఈఆర్‌ఓలు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సహాయక పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై కలెక్టర్ సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో 3,369 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ కేంద్రాల్లో 1,500 కంటే ఎక్కువ ఓటర్లు ఉంటే వాటికి సంబంధించి సహాయక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సహాయక పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై సందేహాలుంటే తెలియజేయాల్సిందిగా కోరారు. ఫారం 6, 8 ద్వారా ఓటరు నమోదు, కరెక్షన్స్ చేసుకోవచ్చన్నారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఆర్‌ఓలు, బీఆర్‌ఎస్, బీఎస్పీ, ఎంఐఎం, కాంగ్రెస్ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



పట్టుబడ్డ నగదును చూపుతున్న పోలీసులు

డబ్బే డబ్బు

178 మంది నుంచి రూ.7,97,87,782 సీజ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్స్ తనిఖీలలో 178 మంది నుంచి రూ. 7,97,87,782 సీజ్ చేసినట్లు కలెక్టర్ భారతి హోళికేరి ప్రకటించారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందులో 77 కేసులకు అప్పీల్ చేసుకోగా, 34 కేసులు పరిష్కరించి రూ.1,25,66,074ల నగదును విడుదల చేసినట్లు తెలిపారు. రూ.10 లక్షలకు పైగా ఉన్న కేసును ఇన్‌కమ్ టాక్స్ విభాగానికి అప్పగించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు సీజ్ చేసిన నగదు విడుదలకు జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో జిల్లా గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీ చైర్మన్‌గా జెడ్పీ సీఈఓ దిలీప్ కుమార్‌ను నియమించినట్లు చెప్పారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రూ.50 వేలకు మించి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న/రవాణా చేస్తున్న నగదు సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. సీజ్ చేసిన నగదుకు సంబంధించి సదరు వ్యక్తులు పూర్తి ఆధారాలను జిల్లా గ్రీవెన్స్ కమిటీలో సమర్పించినట్లైతే, కమిటీ పరిశీలించి సరైన ఆధారాలు ఉన్నట్లయితే సీజ్ చేసిన నగదును విడుదల చేయడం జరుగుతుందన్నారు. నగదు సీజ్‌కు గురైన వారు పూర్తి ఆధారాలతో జిల్లా గ్రీవెన్స్ కమిటీలో సంప్రదించాలని సూచించారు. మిగిలిన వ్యక్తులు కూడా సీజ్ చేసిన తమ నగదుకు సంబంధించి సరైన ఆధారాలను సమీకృత కలెక్టరేట్‌లోని జిల్లా గ్రీవెన్స్ కమిటీలో సమర్పించి తమ డబ్బును విడుదల చేసుకోవాలని సూచించారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీ అధికారులను 76739 16600 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

పోలీసుల తనిఖీల్లో రూ.5 లక్షలు పట్టివేత

పహాడీషరీఫ్: పోలీసుల తనిఖీల్లో రూ.5 లక్షలు పట్టుబడ్డ సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బి.వెంకట్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికలను పురస్కరించుకొని ఎర్రకుంటలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సిద్దిపేట నుంచి కారులో వచ్చిన ఎం.ఎ.బాసిత్‌ను ఆపి సోదాలు నిర్వహించగా రూ.5 లక్షల నగదు లభ్యమైంది. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకొని రిటర్నింగ్ అధికారికి అప్పగించారు.

రూ.2 లక్షలు స్వాధీనం

కొత్తూరు: ఎన్నికల సందర్భంగా శనివారం చేపట్టిన వాహనాల తనిఖీల్లో రూ.2 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శంకర్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్ పరిధిలోని జేపీదర్గా రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా కుమ్మరిగూడకు చెందిన భిక్షపతి తన బైకుపై బ్యాగులో రూ.2లక్షలు తరలిస్తున్నట్లు గుర్తించారు. నగదుకు సంబంధించిన ఎలాంటి రసీదులు, పత్రాలు లేని కారణంగా స్వాధీనం చేసుకున్నారు.

సైకిల్‌పై ప్రచారం.. రూ.88 వేల ఖర్చు

- ఆరోజుల్లో డబ్బుకు అంత ప్రాధాన్యం లేదు
- కరపత్రాలు, వాల్‌పోస్టర్లకు మాత్రమే వెచ్చించే వాళ్లం
- నేడు ఎక్కడ చూసినా ధన ప్రవాహమే..
- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు
- 'సాక్షి'తో ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు



మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు

ఇబ్రహీంపట్నం రూరల్: ''ఆ రోజుల్లో డబ్బుకు అంత ప్రాధాన్యం లేదు.. ఎన్నికల్లో కరపత్రాలు, వాల్ పోస్టర్లకు మాత్రమే కాస్త ఖర్చయ్యేది. సైకిల్‌పై ప్రచారానికి వెళ్లేవాళ్లం.. ప్రజలంటే భయం ఉండేది.. వీలైనంత వరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పని చేసేవాళ్లం.. నేడు డబ్బు చుట్టూ రాజకీయాలు తిరుగుతున్నాయి.. గెలుపు కోసం ఎంత ఖర్చుకైనా వెనుకాడడం లేదు.. అవినీతి పెచ్చుమీరిపోయింది'' అంటున్నారు ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు.. ఎన్నికల నేపథ్యంలో 'సాక్షి' ఆయనను పలుకరించగా నాటి.. నేటి రాజకీయ పరిస్థితులను ఆసక్తిగా వివరించారు. అవి ఆయన మాటల్లోనే..

అప్పట్లో రాజకీయాలంటే ఓ గౌరవం

అప్పట్లో రాజకీయాలు అంటే ఎంతో గౌరవంగా ఉండేది. రాజకీయం అని చెప్పడం తప్పు ప్రజా సేవ అంటే బాగుంటుంది. అది 1989.. సీపీఎం రంగారెడ్డి జిల్లా రథసారథులు కామ్రేడ్ పాషా, నరహరిని హత్య చేశారు. అప్పట్లో జరిగిన ఎన్నికల్లో నన్ను సీపీఎం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారు. కాంగ్రెస్ నుంచి ఏజీ కృష్ణ పోటీ చేశారు. పార్టీ రూ.88 వేలు మాత్రమే ఖర్చు చేసింది. సైకిల్‌పై ప్రచారం చేసేవాళ్లం. రెండు జీపులు, ఒక కారు మాత్రమే ఉండేవి. కరపత్రాలు, వాల్‌పోస్టర్లతో ప్రచారం చేశాం. కార్యకర్తలకు డబ్బు ఖర్చయ్యేది కాదు. 4వేల ఓట్ల మెజార్టీతో గెలిచాను. రెండోసారి కె. సత్యనారాయణపై 29వేల మెజార్టీతో విజయం సాధించాను. అప్పుడు రూ.3 లక్షలు మాత్రమే ఖర్చు చేశాం.

ఇప్పుడంతా డబ్బుతో రాజ్యం..

మొదటిసారి ఎమ్మెల్యే అయినప్పుడు రూ.7,500 ప్రభుత్వం ఇస్తే అందులో నుంచి రూ.వెయ్యి తీసుకునేది. రెండోసారి రూ.18 వేలు ప్రభుత్వం ఇస్తే రూ.1,200 తీసుకునేది. మిగతా డబ్బు ప్రజల కోసం ఖర్చు చేసేది. ప్రస్తుతం చట్ట సభల్లో ఎక్కడ చూసినా డబ్బున్న వారే ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలుగా ఉంటున్నారు. నేర చరిత కలిగిన వారు అధికంగా ఉంటున్నారు. స్వార్థ పూరిత రాజకీయాలు ఎక్కువయ్యాయి. డబ్బు, మద్యంతో అధికారం చేజిక్కించుకుంటున్నారు. విచ్చలవిడిగా ఖర్చు చేస్తూ రాజకీయాల్లో రాణిస్తున్నారు. అబద్ధాల పునాదుల మీద రాజకీయాలు నడుపుతున్నారు. సంపాదించుకోవడానికి రాజకీయాల్లోకి వస్తున్నారు. హక్కులు హరించి ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యేలు రూ.లక్షల్లో జీతభత్యాలు తీసుకుంటున్నారు. కానీ ప్రజల కోసం పని చేయడం లేదు. భూ కబ్జాలు, అవినీతి సొమ్ముతో బతికేస్తున్నారు. ప్రజల కోసం పని చేసే వారు మచ్చుకైన కనిపించడం లేదు.

నోటుకు ఓటును అమ్ముకోవద్దు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రజలకు ఇచ్చిన ఓటు హక్కును సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలి. ప్రజల కోసం నిస్వార్థంగా పని చేసే నాయకుడిని ఎన్నుకోవాలి. ఓటు వజ్రాయుధం బ్రాండీ సీసాకు, నోట్ల కట్టలకు అమ్ముకోవద్దు. నిర్భయంగా ఓటు వేసి ప్రజానాయకుడిని ఎన్నుకోవాలి. పని చేయకుంటే ధైర్యంగా ప్రశ్నించి పని చేయించుకోవాలి.



వెరై'టీ'గా ప్రచారం

అగ్గిపుల్ల.. కుక్కపిల్ల.. సబ్బుబిల్ల కాదేది కవితకు అనర్హం అన్నట్టు రాజకీయ నాయకులు కూడా దేన్నీ వదలడం లేదు. ఓటర్లను శత విధాలా ఆకర్షించేందుకు వినూత్న మార్గాలను అన్వేషిస్తున్నారు. ఇందులో భాగంగా ఓ కాంగ్రెస్ పార్టీ నేత టీ కప్పుపై 'చేయి గుర్తుకు ఓటు వేద్దాం.. ఎల్బీనగర్‌కు బాటేద్దాం' అంటూ ముద్రించి హోటల్స్‌లో ఉచితంగా సరఫరా చేస్తున్నారు. కష్టమర్లు చాయ్ తాగినప్పుడు ఐదు నిమిషాలైనా చేతిలో ఉంటుందని.. వారి దృష్టిలో పడుతుందని భావిస్తున్నారు.

– హయత్‌నగర్







ఎలాగైనా.. ఊరికి వెళ్లాల్సిందే!

నగర దారులన్నీ పల్లె'టూరు' దారి పడుతున్నాయ్. బస్సూ, రైలూ, కారూ, బైకూ.. ఏదైనా సరే ఊరికి వెళ్లడమే లక్ష్యం. ఆదివారం సద్దుల బతుకమ్మ, సోమవారం దసరా పండగ కావడంతో శనివారం పట్నవాసులు పల్లెలకు పయనమయ్యారు. సొంతూరిని ఓసారి మనసారా చూసొద్దామని ఆశగా బయలుదేరారు. నగరంలోని ఎంజీబీఎస్, జేబీఎస్ తదితర బస్టాండ్లు, సికింద్రాబాద్, కాచిగూడ రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి.

రాజేంద్రనగర్ నుంచి అవకాశం కల్పించాలి


దరఖాస్తు అందజేస్తున్న సొంటిరెడ్డి రాఘవ రెడ్డి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌టీపీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని కోరుతూ సొంటిరెడ్డి రాఘవ రెడ్డి శనివారం వైఎస్సార్ తెలంగాణ పార్టీ కార్యాలయంలో దరఖాస్తు ఫారాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొలన్ రాంరెడ్డి, సదాల శ్రీనివాస్ రెడ్డి, జగదీశ్, దశరథ్, అనిల్, పృథ్వీ, సైఫ్ తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

The general public is hereby informed that my client The general public is hereby informed that my client **M/S NAIPUNYA DEVELOPERS, Represented by its Proprietor:- SRI M. Narsimha Reddy,** S/o. M.Biksha Reddy Aged about 56 years, Occupation: Business, Resident of H.No.-19-907/2, Reddy Colony, Nagarjuna Nagar, Miryalaguda, Nalgonda District-500068, into an agreement of sale for purchase of agriculture land in Sy. Nos 16/ఆ, 18/ఆ1, 20/ఆ, 18/ఆ2, 18/ఆ3, admeasuring Acr 4.33Gnts, Acr 0.19Gts, Acr 1.21Gts, Acr 0.27Gts, Acr 0.28Gts Total admeasuring Acr8.08Gts equivalent to 3.27 hectares Situated at, Khanapur Village, Talakonda Palli Mandal, Ranga Reddy District (Previous Mahaboob Nagar District), Telangana from **SRI Madhireddy Yadi Reddy,** S/o. M.Narsimha Reddy Aged about 64 years, **SRI Madhireddy Karunakar Reddy,** S/o. M.Yadi Reddy Aged about 38 years, R/o1-48, Khanapur Village, Talakonda Palli Mandal, Ranga Reddy District (Previous Mahaboob Nagar District), Telangana **SRI Madhireddy Sudhakar Reddy,** S/o. M.Yadi Reddy Aged about 40 years, R/o Plot No-C1, Bhagyanagar Colony, Lingoji Guda, Ranga Reddy District, Telangana, paid advance sale consideration and in process of obtaining registered sale deed. The general public is further informed that if any person/s is/are having any right/interest over the said Plot, They may contact the under signed address within 7 days from the date of publication with all relevant documents to suffice their interest over the said land. If no objection is received within the prescribed time, it will be treated as No-objection. Thereafter, my client will proceed with the balance transaction.

V.SRAVAN RAO, Advocate
H.No.3-1-98, Road No-5, Shivapuri Colony, L.B.Nagar, Ranga Reddy-500074. Ph:76809 52779.

సద్దుల బతుకమ్మకు ఘాట్ సిద్ధం

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలో ఆదివారం సాయంత్రం జరిగే సద్దుల బతుకమ్మ వేడుకలకు కాముని చెరువు ఘాట్ సిద్ధమైంది. గత పదిరోజులుగా చేపడుతున్న పనులు పూర్తయ్యాయి. బతుకమ్మలను భద్రంగా జారవిడిచేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. సద్దుల బతుకమ్మ వేడుకలను సంతోషంగా నిర్వహించుకోవాలని మున్సిపల చైర్‌పర్సన్ సుష్మ సూచించారు.

ఉమ్రా యాత్ర దిగ్విజయం

శంషాబాద్: ఇరవై రోజుల కిందట ఉమ్రా యాత్రకు వెళ్లి యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకుని తిరిగి వచ్చిన వారికి శంషాబాద్ విమానాశ్రయంలో శనివారం ఘనంగా స్వాగతం పలికారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాట రాష్ట్రాలకు చెందిన యాత్రికులకు వారి కుటుంబసభ్యులు, బంధువులు, పుష్పగుచ్ఛాలు, శాలువాలు వేసి స్వాగతం పలికారు.

ప్రతిపక్షాల మాట నమ్మొద్దు

- అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి
- షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్


కేశంపేట: ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కేశంపేట: ఎన్నికల ముందు వచ్చి ప్రగల్భాలు పలికే ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దని.. కారు గుర్తుకు ఓటేసి మరో మారు ఆశీర్వదించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని కోనాయపల్లి, సంతాపూర్, కొత్తపేట గ్రామాల్లో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో సీసీ రోడ్లు, యూజీడీ నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు వచ్చేలా చర్యలు తీసుకున్నామని గుర్తు చేశారు. గ్రామాలకు బీటీ రోడ్లు, గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించామని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్‌తోనే పేదలకు సంక్షేమ ఫలాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, కొత్తపేట సర్పంచ్ నవీన్‌కుమార్, మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్, మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా చేరికలు

నందిగామ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్శితులై స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. నందిగామకు చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు అంజయ్యగౌడ్, రామేశ్వర్ గౌడ్, ప్రభాకర్ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, మధుసూదన్ గౌడ్ తదితరులు శనివారం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, ఉప సర్పంచ్ కుమార్ గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పద్మారెడ్డి, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, నాయకులు విక్రం శర్మ, పెంటయ్య గౌడ్, కిష్టయ్య, రాములు, రాంచంద్రారెడ్డి, అంజయ్య, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా బైక్ ర్యాలీ: వ్యక్తిపై కేసు నమోదు

షాద్‌నగర్ రూరల్: ఎలాంటి అనుమతులు లేకుండా బైక్ ర్యాలీ నిర్వహించిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు షాద్‌నగర్ పట్టణ సీఐ ప్రతాప్‌లింగం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామం నుంచి పట్టణంలోని కోర్టు కాంప్లెక్స్ వెనక వరకు జమ్రుద్‌ఖాన్ అనే వ్యక్తి సుమారు 70 నుంచి 80 బైక్‌లతో ఎలాంటి అనుమతులు లేకుండా ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం సభ్యుడు కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కాంగ్రెస్ జెండా.. పేదలకు అండ


ఎమ్మెల్సీ కసిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న సర్పంచ్ రవీందర్ తదితరులు

- ఎమ్మెల్సీ, కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: కాంగ్రెస్ జెండా ఎల్లవేలలా పేదలకు అండగా ఉంటుందని ఎమ్మెల్సీ, కల్వకుర్తి నియోజకవర్గ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గోవిందాయపల్లి సర్పంచ్ కంబాలపల్లి రవీందర్, వార్డు సభ్యులు రమేశ్, బీజేపీ నాయకులు శ్రీకాంత్, వెంకటయ్య, బాలేశ్వర్, అంజయ్య, శ్రీకాంత్, కృష్ణయ్య, జంగయ్య, ప్రశాంత్, పవన్, అభిగౌడ్, అభిషేక్, శేఖర్, నర్సింహ, బన్నీ, శ్రీశైలం, సత్తయ్య మరో 50 మంది కార్యకర్తలు కసిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి హస్తం గూటికి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ఆశీర్వదిస్తే అభివృద్ధి చేసి చూపుతానన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు సోనియాగాంధీ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందని.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో నిరుద్యోగులు, పేద, మధ్య తరగతితో పాటు అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. కల్వకుర్తి గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరె గ్యారెంటీలు అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు అశోక్, నాయకులు శేఖర్‌గౌడ్, జహంగీర్‌బాబా, వెంకటేశ్, ఇక్బాల్ తదితరులు ఉన్నారు.

నకిలీ బంగారంతో రూ.5 లక్షలకు టోకరా

నలుగురు నిందితులను అరెస్టు చేసిన యాచారం పోలీసులు

యాచారం: నకిలీ బంగారం ఇచ్చి రూ.5 లక్షలతో ఉడాయించిన ఘటనలో శనివారం యాచారం పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. యాచారం మండలం నల్లవెల్లి తండాకు చెందిన లచ్చిరాం కొద్ది రోజుల క్రితం మాల్ యూనియన్ బ్యాంకులో రూ.5 లక్షల నగదును డ్రా చేసుకుని ఇంటికి వస్తుండగా ఏపీలోని నెల్లూరు జిల్లా సంగం మండల కేంద్రానికి చెందిన మాల్యాద్రి, ఇతని భార్య సుభాషిణి, రవి, ఇతని భార్య ధనమ్మ.. లచ్చిరాం కదలికలపై నిఘా పెట్టారు. లచ్చిరాం నల్లవెల్లి తండాకు వెళ్లడాన్ని గమనించి అతన్ని అనుసరిస్తూ ఇంటికి చేరుకున్నారు. వీరి వద్ద ఉన్న నకిలీ బంగారాన్ని చూపించి.. ఇది అసలు బంగారమేనని నమ్మించారు. దీని విలువ పెద్ద మొత్తంలో ఉంటుందని, తమకు అత్యవసరంగా రూ.10 లక్షలు కావాలని నమ్మబలికారు. వీరి మోసాన్ని పసిగట్టని బాధితుడు బ్యాంకు నుంచి తెచ్చిన రూ.5 లక్షలు ఇచ్చేశాడు. ఆ తర్వాత మాల్‌లోని ఓ దుకాణం వద్దకు తీసుకెళ్లి పరీక్షించగా బంగారం నకిలీదని తేలడంతో లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తుండగా.. శనివారం ఉదయం మాల్ సంతలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పీఎస్‌కు తరలించి తమదైన శైలిలో విచారించగా నల్లవెల్లి తండాలో లచ్చిరాంకు నకిలీ బంగారం ఇచ్చి రూ.5 లక్షల నగదును తీసుకున్నట్లు ఒప్పుకొన్నారు. వీరిపై సంగారెడ్డి జిల్లా కంగ్టి పోలీస్ స్టేషన్‌లో కూడా కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

కడుపు నొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య

కొందుర్గు: కడుపునొప్పి భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం కొందుర్గు మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాల గ్రామానికి చెందిన అమృతకు కొందుర్గుకు చెందిన కుమార్‌తో 14 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. అమృత కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. శనివారం తెల్లవారుజామున భరించలేని నొప్పి రావడంతో ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయమై మృతురాలు తల్లి సాయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా దొండ రమణారెడ్డి


రమణారెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న నర్సింహారెడ్డి

ఇబ్రహీంపట్నం: బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా రాయపోల్ గ్రామానికి చెందిన దొండ రమణారెడ్డిని నియమించారు. ఈ మేరకు శనివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ఆయనకు నియామక పత్రం అందజేశారు. అనంతరం రమణారెడ్డి మాట్లాడుతూ. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలకు తగిన న్యాయం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తానని తెలిపారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ



శంకర్‌పల్లి: బతుకమ్మ ఆడుతున్న మహిళలు

శంకర్‌పల్లి: సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అని సర్పంచ్ లాగుల లావణ్య అన్నారు. మండలంలోని కొండకల్ గ్రామంలో శనివారం లాగుల లావణ్య ఆధ్వర్యంలో బతుకమ్మ ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మలను తీసుకొచ్చి ఆడి పాడారు. యువతులు కోలాటం ఆడారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్: మండల పరిధిలోని అప్పోజీగూడలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. మహిళలు తీరొక్కపూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. అనంతరం సమీపంలోని చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొర్కంటి రాజు, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం


అమృత (ఫైల్)

శంషాబాద్ రూరల్: ఆసుపత్రికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి మహిళ అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దగోల్కొండలో నివసిస్తున్న నెల్లి బాల్‌రాజ్, అమృత(23) దంపతులు స్థానికంగా ఉన్న నర్సరీలో పనిచేస్తున్నారు. ఈనెల 20న అమృత తనకు జ్వరం వచ్చిందని శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి కుమారుడితో పాటు వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి కుమారుడు శివప్రసాద్ ఇంటి వద్ద వదిలివెళ్లారు. తల్లి గురించి కొడుకు భయంతో వివరాలు చెప్పడంలేదు. దీంతో భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.